క్లుప్తంగా

నేడు గిరిజన దర్బార్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే గిరిజన దర్బార్‌లో ఆదివాసీలు తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేయాలని సూచించారు.

రైతులను మోసం చేయడం దారుణం

అశ్వారావుపేటరూరల్: రుణమాఫీ విషయంలో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందని మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి అన్నారు. అశ్వారావుపేటలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.2 లక్షలు దాటిన వారికి రుణమాఫీ లేదని అసెంబ్లీలో ప్రకటించడం తగదన్నారు. రుణమాఫీ కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారని, తక్షణమే రుణమాఫీ చేయాలని కోరారు. తప్పుడు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరలోనే రైతులు తగిన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో నాయకులు యూఎస్ ప్రకాశ్‌రావు, సత్యవరపు సంపూర్ణ, ఎం.మోహన్, హరి, చరణ్ పాల్గొన్నారు.

సీతక్కకు కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

అశ్వాపురం: అసెంబ్లీలో మంత్రి సీతక్కపై హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకొని.. సీతక్కకు బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య డిమాండ్ చేశారు. అశ్వాపురంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు ఆడవాళ్లను అడ్డుపెట్టుకొని చిల్లర రాజకీయాలు చేసి గెలిచిన కౌశిక్‌రెడ్డి నిత్యం జనాల్లో ఉండే సీతక్కని విమర్శించే అర్హత లేదన్నారు. ఇంకోసారి మంత్రి సీతక్కను మర్యాద లేకుండా మాట్లాడితే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

ముందస్తు అరెస్టులు



అశ్వారావుపేటరూరల్: పోలీస్ స్టేషన్‌లో ఆశా కార్యకర్తలు

అశ్వారావుపేటరూరల్: ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులను ఆదివారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. హైదరాబాద్‌లో జరుగుతున్న ధర్నాలో పాల్గొనేందుకు వెళ్తున్నట్లు సమాచారం మేరకు కొందరు ఆశా కార్యకర్తలు, వంట కార్మికులను అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు ఎస్‌ఐ యయాతిరాజు తెలిపారు. కాగా, సమస్యలపై పోరాడేందుకు తరలివెళ్తున్న కార్మికులను అరెస్టు చేసి అడ్డుకోవడం తగదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ తెలిపారు.

దమ్మపేటలో..



దమ్మపేట: అరెస్టయిన ఆశా కార్యకర్తలు

దమ్మపేట: హైదరాబాద్‌లో ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించేందుకు నిర్ణయించడంతో ఆదివారం పోలీసులు ముందస్తు అరెస్టులు చేపట్టారు. వారిని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు లాంటివని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, తమ న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చేవరకు పోరాటాలను చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

ఘనంగా 103వ పుట్టినరోజు వేడుక



పుట్టినరోజు వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే

దుమ్ముగూడెం: మండలంలోని నడికుడిలోని ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం గోగుబాకకు చెందిన సాగి వెంకటసీతారామచంద్రరాజు 103వ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొమరం ఫణీశ్వరమ్మ తదితరులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. సుమారు 1500 మంది హాజరైనట్లు చంద్రరాజు మనవడు వెంకట జగన్నాథరాజు తెలిపారు.

లోఓల్టేజీ సమస్యకు చెక్



భద్రాచలంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన సందర్భంగా ఎస్‌ఈ మహేందర్, ఉద్యోగులు (ఫైల్)

- వేసవిలో విద్యుత్ అంతరాయాల నివారణపై దృష్టి
- అవసరమైన చోట్ల అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- భద్రాచలంలో మెరుగైన సరఫరాకు కార్యాచరణ



కొత్తగా ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో రోజురోజుకూ ఎండలు మండిపోతున్నాయి. మార్చిలోనే వేసవి తీవ్రత పెరగడంతో విద్యుత్ వినియోగం కూడా క్రమక్రమంగా పెరుగుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే రాష్ట్ర స్థాయి అధికారులు సమావేశాలు నిర్వహించి జిల్లా అధికారులకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం విద్యుత్ శాఖ ఎస్‌ఈ మహేందర్ ఆధ్వర్యంలో భద్రాచలం డీఈ జీవన్ కుమార్, ఏడీఈ వేణు పట్టణంలో లోఓల్టేజీ ఉన్న ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో అదనంగా నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంపై దృష్టి సారించారు.

అంతరాయం లేకుండా సరఫరా

వేసవి తీవ్రతతో ప్రజలు విద్యుత్ వాడకం ఎక్కువైనా ఎక్కడా కూడా సరఫరాలో అంతరాయం ఎదురుకావొద్దనే లక్ష్యంతో అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. వేసవిలో విద్యుత్ వాడకం అధికంగా ఉంటుండటంతో ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కువగా కాలిపోతుంటాయి. ఈ పరిస్థితి అధిగమించేందుకే విద్యుత్ శాఖ ముందస్తు చర్యలు తీసుకుంటోంది. అయితే, క్షేత్రస్థాయిలోనూ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా అధికారులు పర్యవేక్షించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

28 ట్రాన్స్‌ఫార్మర్లకు ప్రతిపాదన

భద్రాచలంలోని వివిధ కాలనీల్లో మొత్తం రూ.1.50 కోట్లతో 28 నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అందుకు సంబంధించిన పనులను వేగవంతం చేశారు. అందులో భాగంగా ఇటీవల పట్టణంలో పలుకాలనీల్లో ఇప్పటికే ఏర్పాటు చేసిన 12 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఎస్‌ఈ మహేందర్ ప్రారంభించారు. పట్టణవ్యాప్తంగా ఇప్పటికే 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 300 వరకు ఉండగా, ఇవికాకుండా మరో 40 చోట్ల 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. భద్రాచలంలో 28 చోట్ల 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను మార్చి 160 కేవీ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తుండడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండదని అధికారులు చెబుతున్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి



వేసవిలోనూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలనే ఆలోచనలో భాగంగా పట్టణంలో రూ.1.50 కోట్లతో నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నాం. లోఓల్టేజీ సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. వేసవి ఎండల కారణంగా విద్యుత్ వినియోగం అధికంగా ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని భద్రాచలం డివిజన్‌లో అవసరమైన చోట్ల నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి సమస్యలు అధిగమించేలా చర్యలు చేపట్టాం.

–జీవన్‌కుమార్, విద్యుత్ శాఖ, డీఈ, భద్రాచలం

భగత్‌సింగ్ ఆదర్శప్రాయుడు



గుండాల: నివాళులర్పిస్తున్న నాయకులు



భద్రాచలంటౌన్: భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

బ్రిటీష్ అధికారులకు వ్యతిరేకంగా చిన్న వయస్సులోనే ఎదురొడ్డి పోరాడి.. ఉరి శిక్షను కూడా లెక్కచేయని ధీరోదాత్తుడు భగత్‌సింగ్ అని, నేటి యువతకు ఆయన ఆదర్శప్రాయుడని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. భగత్‌సింగ్ చిరు ప్రాయంలోనే దేశంపై అమితమైన ప్రేమను కనబరిచారని, ఆ ప్రేమే దేశం కోసం ప్రాణాలు అర్పించేందుకు సిద్ధమయ్యేలా చేసిందన్నారు. నేటి యువత ఆయన చరిత్ర చదవాలని, ఆయన స్ఫూర్తితో రాజకీయాల్లో అడుగుపెట్టాలని పిలుపునిచ్చారు.



ములకలపల్లి: భగత్‌సింగ్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న అన్నవరపు కనకయ్య

–సాక్షి నెట్‌వర్క్

కాంగ్రెస్ నేతల చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మణుగూరుటౌన్: బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లులు శాసనసభలో ఏకగ్రీవంగా ఆమోదం పొందడం హర్షణీయమని, ఈ నిర్ణయాలతో కాంగ్రెస్ పార్టీని ప్రజలు గుండెల్లో దాచుకుంటారని ఐఎన్‌టీయూసీ మణుగూరు బ్రాంచ్ కార్యదర్శి షేక్ అబ్దుల్ రవూఫ్ అన్నారు. ఆదివారం కొండాపురం సీఎస్‌పీలో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేయగా ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తోందని, జాతీయ నాయకులు రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట ప్రకారం ఎంతో ప్రతిష్టాత్మకమైన బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టి, ఆమోదించి చట్టబద్ధత కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డికి, ఇతర రాష్ట్ర మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ ప్రెసిడెంట్ ముకేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కేసీహెచ్‌పీ ఫిట్ సెక్రటరీ శ్యామ్‌వర్మ, అజిత్, బ్రాంచ్ నాయకులు సదానందం, సమ్మయ్య, నాయకులు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమిస్తే సహించేది లేదు..



రోడ్డును పరిశీలిస్తున్న వివిధ పార్టీల నాయకులు

గుండాల: ఎవరైనా రోడ్డును ఆక్రమిస్తే ఊరుకునేది లేదని అఖిలపక్ష పార్టీల నాయకులు హెచ్చరించారు. ఆదివారం ఆళ్లపల్లి మండల కేంద్రంలో ప్రధాన కూడలి వద్ద రోడ్డు ఆక్రమించుకున్నారనే అంశంపై సోషల్ వర్కర్, సేవ్ కొత్తగూడెం, సేవ్ మున్సిపాలిటీ కన్వీనర్ జలాల్ పిలుపుమేరకు అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అక్కడ వందేళ్ల నుంచి రోడ్డు ఉందని, సీసీ రోడ్డును పగలగొట్టడం సరికాదన్నారు. ఐదు రోజుల్లోగా రోడ్డు ఆక్రమణను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ప్రజల సమక్షంలో మట్టిని తొలగిస్తామని తీర్మానించారు. కార్యక్రమంలో వాసం శ్రీకాంత్, వాసం రామకృష్ణ, మాజీ ఎంపీపీ ముక్తి సత్యం, డాక్టర్ శ్రీను, నరెడ్ల వెంకన్న, తెలగాని శ్రీనివాస్, బుర్ర వెంకన్న, వెంకటేశ్, మహమ్మద్ ఖయ్యూం, యాసారపు వెంకన్న, పరిశిక రవి, పూనెం రంగయ్య, చింత నరసింహారావు, వజ్రం తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక 'ఇఫ్తార్'



ప్రార్థన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

మణుగూరురూరల్: మత సామరస్యానికి ఇఫ్తార్ విందు ప్రతీక అని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మండలంలోని బాంబేకాలనీ మహమ్మదీయ మజీద్‌లో సింగరేణి కార్మిక సంఘం నాయకుడు వూకంటి ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేటి సమాజానికి మహ్మద్ ప్రవక్త ప్రబోధనలు ఎంతో అవసరమన్నారు. అనంతరం ఆయన ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మణుగూరు మాజీ జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు, పట్టణ కన్వీనర్ కుంటా లక్ష్మణ్, నాయకులు అడపా అప్పారావు, ఎస్‌వీఎస్‌ఎన్ వర్మ, కాపా శివాజీ, డి.వీరభద్రయ్య, ఇందూరి శంకర్, మాదాసి శ్రీనివాస్, కలగూర శంకర్, ఎస్.రామారావు, మోహన్‌రావు, టీఎస్ ప్రసాద్, బాలాజీ, ముస్లిం మతపెద్దలు హబీబ్, అమీన్, కుద్దూస్, షాబుద్దీన్, పర్వేజ్, ఇమామ్, ఇస్మాయిల్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

పేరుమార్పుపై పునరాలోచించాలి



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

మణుగూరుటౌన్: తెలుగు వర్సిటీ పేరు మార్పుపై పునరాలోచన చేయాలని, ఆర్యవైశ్యుల మనోభావాలు దెబ్బతీయొద్దని, తెలుగు వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు కొనసాగించాలని ఆర్యవైశ్య సంఘం మండల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వాసవీనగర్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి, మాట్లాడారు. శాసనసభలో తెలంగాణ రాష్ట్ర పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ (సవరణ) బిల్లు–2025ను ప్రవేశపెట్టి ఆమోదించడాన్ని ఖండిస్తున్నామని, తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు తొలగించొద్దని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బండారు నర్సింహారావు, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రమేశ్‌బాబు, వాసవీక్లబ్ అధ్యక్షుడు శ్యాం, వనిత వైభవం అధ్యక్షురాలు అంజలి, చిట్టూరు శేషుబాబు, కత్తిరాము, దోసపాటి నాగేశ్వరరావు, ధర్మయ్య, సముద్రాల కృష్ణమూర్తి, దింటకుర్తి బ్రహ్మయ్య, చిట్టూరి నాగరత్నమణి, కొత్త ఇందుమతి, కడవెండి విశ్వనాథ గుప్తా, సాయి, సుగ్గల ఇందుమతి నాయకులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, ఆర్‌ఐ కల్లూరి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు లంకా శ్రీనివాసరావు, అన్నె సత్యనారాయణమూర్తి, కెల్లా శేఖర్, కుంజా శ్రీనివాసరావు, దర్శి సాంబశివరావు, పిలక వెంకటరమణారెడ్డి, మట్టా శివాజీ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వెదురు బొంగులు స్వాధీనం

అశ్వారావుపేటరూరల్: అటవీ శాఖ ప్లాంటేషన్ నుంచి అక్రమంగా వెదురు బొంగులు తరలిస్తున్న రెండు ఎడ్ల బండ్లను ఆదివారం పట్టుకున్నారు. మండలంలోని పాపిడిగూడెం సమీపంలోగల అటవీ శాఖ వెదురు ప్లాంటేషన్ నుంచి అశ్వారావుపేటలోని దొంతికుంటకు చెందిన శ్రీను, రామకృష్ణలు వెదురు నరికి తరలిస్తుండగా పట్టుకుని రేంజ్ కార్యాలయానికి తరలించారు. పట్టుబడిన వెదురు బొంగుల విలువ రూ.10 వేలు ఉంటుందని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఫారెస్టు రేంజర్ మురళి తెలిపారు.

జామాయిల్ చెట్లు నరికివేత



నరికిన జామాయిల్ చెట్లు

అశ్వాపురం: మండల పరిధిలోని తుమ్మలచెరువు గ్రామ పంచాయతీ పరిధిలోని కుర్వాపల్లి కొత్తూరు గ్రామం పరిధిలో మొండికుంట గ్రామానికి చెందిన రైతు భీముడి లింగారెడ్డికి చెందిన జామాయిల్ చెట్లను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. 130 చెట్లు నరికివేసినట్లు బాధిత రైతు ఫిర్యాదు చేయగా, సీఐ అశోక్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అశ్వారావుపేటరూరల్: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ టీ యయాతి రాజు కథనం ప్రకారం.. ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి నుంచి అశ్వారావుపేట మండలం వినాయకపురం గ్రామానికి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని అశ్వారావుపేట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గుర్తించి పట్టుకున్నారు. లారీని సీజ్ చేసి, డ్రైవర్ గోశాల బాబుపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ యయాతిరాజు తెలిపారు. ఎవరైనా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

కోల్ 'ట్రాన్స్‌పోర్ట్' కమిటీ ఎన్నిక..



అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

మణుగూరురూరల్: మండలంలోని కిన్నెర కల్యాణ మండపంలో నిర్వహించిన మణుగూరు కోల్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ సమావేశంలో ఆదివారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మునునూరి చందర్‌రావు, ఉపాధ్యక్షుడిగా మాదాడి రాజేశ్, కార్యదర్శిగా అన్నమనేని ప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా దిలీప్‌కుమార్, కోశాధికారిగా కేఆర్ ప్రసాద్‌తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షుడు మాట్లాడుతూ.. సంఘం బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

మా గ్రామాల సమస్యలు తీర్చండి..



మాట్లాడుతున్న అయోధ్య

మణుగూరుటౌన్: మణుగూరు ఓసీ విస్తరణలో భాగంగా విఠల్‌రావునగర్, రాజుపేట సమీపంలో బొగ్గు తీస్తున్నారని, ఆ పక్కనే ఉన్న తమ గ్రామాల పరిస్థితి అధ్వానంగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్యకు విన్నవించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసిన గ్రామస్తులు మాట్లాడారు. ఓసీ విస్తరణతో తమ రెండు గ్రామాల ప్రజల పరిస్థితి అధ్వానంగా మారిందని, బ్లాస్టింగ్‌లకు ఇళ్లు అదిరి బీటలు వారుతున్నాయని, దుమ్ము, ధూళి ఇళ్ల మీద పడి, ఇంట్లో ఉండే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. గతంలోనూ మణుగూరు ఓసీ కోసం మల్లెపల్లి, ఎగ్గడిగూడెం, పద్మగూడెం ప్రాంతాల ప్రజల నుంచి సర్వం లాక్కున్నారని ఆరోపించారు. పూర్తిస్థాయి ప్యాకేజీతో న్యాయం చేయకపోగా, తమను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అయోధ్య మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మాకూ చేప కావాలి..



కొంగలచెరువులో చేపలు పడుతున్న ప్రజలు

చిన్నా పెద్దా తేడా లేకుండా వలలు, ఊతలు చేతపట్టుకొని చెరువులోకి దిగి చేపలను వేటాడారు. ఆదివారం మండలంలోని చిరుమళ్ల గ్రామంలోని కొంగలచెరువులో గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా చెరువు వద్దకు చేరుకుని చేపలు పట్టారు. ప్రజలందరూ కలిసి చేపలు పట్టడంతో చెరువు వద్ద సందడిగా మారింది. ఈ దృశ్యాన్ని 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది.

కమ్మేసిన కలువ..



తామర మొక్కలతో నిండిపోయిన చెరువు

అశ్వారావుపేటరూరల్: మండుతున్న ఎండల్లో కూడా పచ్చని మొక్కలతో కళకళలాడుతున్న ఈ దృశ్యం ఓ సాగునీటి చెరువులోనిది. కనుచూపు మేర కమ్మేసిన తామర మొక్కల్ని చూస్తే ఇది చెరువుగా ఎవరూ గుర్తించలేరు. ఇది అశ్వారావుపేట మండలంలోని నందిపాడు గ్రామ శివారులో గల సాగునీటి చెరువు. ఈ చెరువంతా తామర మొక్కలతో నిండిపోగా, వాటికి పూసిన తెల్లని పువ్వులు కనువిందు చేస్తున్నాయి. దీంతో చిన్నారులు చెరువు వద్దకు వచ్చి తామర పువ్వులను తీసుకెళ్తున్నారు. ఈ దృశ్యాన్ని ఆదివారం ×సాక్షి₹ కెమెరా క్లిక్ మనిపించింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కరకగూడెం: రోడ్డు ప్రమాదంలో ఆదివారం ఇద్దరికి గాయాలయ్యాయి. మద్రిమొదలు గ్రామానికి చెందిన రఘునాథరావు, రామకళ దంపతులు కరకగూడెంలో పని ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తున్నారు. అదే సమయంలో గణేష్ మరో బైక్‌పై వస్తుండగా భట్టుపల్లిలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గణేశ్, రామకళకు గాయాలయ్యాయి.